## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

# జనసముద్రం న్యూస్

నిరంతర వార్తా ప్రవాహం

ప్రతి అక్షరం జనం కోసం

Save Farmers

JANASAMUDRAM.COM

సంపుటి:04 | సంచిక:360 | సోమవారం ఆగస్ట్ 03, 2026 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00


## ప్రధాని నిర్ణయంతో నా కుమార్తెకు పునర్జన్మ:

### నోయిడా బాలిక తల్లి



- ప్రధాని మోదీకి బాలిక క్షమాపణ.
- "నా కుమార్తెకు పునర్జన్మ లభించింది" -- తల్లి.
- ప్రధాని క్షమాభిక్షకు తల్లి కృతజ్ఞతలు.
- కేసు కొట్టివేయాలని విజ్ఞప్తి.
- ఎఫ్ఐఆర్‌లో వయసు తప్పుగా నమోదు చేశారని ఆరోపణ.
- సోషల్ మీడియాలో బెదిరింపులు వస్తున్నాయని ఆందోళన.

2లో

## సీజేపీ భవిష్యత్ కార్యాచరణ..
## ఆగస్టు 5న కీలక సమావేశం

- ఆగస్టు 5న సీజేపీ కోర్ కమిటీ కీలక సమావేశం.
- అభిజీత్ దీప్కే నివాసంలో సమావేశం.
- విద్యార్థుల అభిప్రాయాలపై చర్చ.
- విద్యార్థుల కేసుల ఉపసంహరణపై కార్యాచరణ.
- సమావేశం అనంతరం భవిష్యత్ కార్యాచరణ ప్రకటన.




2లో

# బోనాల జాతర..

## మహాకాళిని దర్శించుకున్న సీఎం రేవంత్ --

- బోనాల జాతరలో మహాకాళి అమ్మవారిని దర్శించుకున్న సీఎం రేవంత్ రెడ్డి.
- అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన సీఎం.
- రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, సంక్షేమం కోసం ప్రార్థనలు.
- బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపిన సీఎం.
- ఆలయ ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలపై అధికారులకు సూచనలు.
- భద్రత, ట్రాఫిక్, పారిశుధ్య ఏర్పాట్లపై దృష్టి.
- మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



తెలంగాణలో అత్యంత వైభవంగా జరిగే బోనాల ఉత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని శ్రీ సింహవాహిని మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా సీఎం రాష్ట్ర ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, తెలంగాణ ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి,



రైతుల సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు, ప్రజల శ్రేయస్సు కోసం ప్రత్యేకంగా ప్రార్థనలు చేసినట్లు పేర్కొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులను సీఎం పలకరించి, ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రత, ట్రాఫిక్, తాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్య ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ఆలయ కమిటీ సభ్యులు కూడా పాల్గొన్నారు. బోనాల జాతర సందర్భంగా ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉండగా, అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.



## బోనాలు, శివసత్తుల నృత్యాలు..

### ఘనంగా ఉజ్జయిని బోనాల జాతర



సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి బోనాల జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. అమ్మవారికి తెల్లవారుజామునే మహా మంగళ హారతి ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్రం ప్రభుత్వం తరఫున బంగారు బోనం, పట్టు వస్త్రాలు సమర్పించారు. పలువురు ప్రముఖులు అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. యువతులు, మహిళలు బోనాలతో, శివసత్తుల నృత్యాలతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.

## వైకాపా హయాంలో రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేశారు:



2లో

- వైకాపాపై మంత్రి అనగాని విమర్శలు.
- "రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేశారు" వ్యాఖ్య.
- రేపల్లెలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం.
- కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరణ.
- ప్రజల సమస్యల పరిష్కారానికి హామీ.
- మహిళా సాధికారితకు ప్రత్యేక పథకాలు అమలు.

## ఉత్సవాల నిర్వహణకు బిచ్చమెత్తుకోవాలా?:



2లో

## వచ్చే ఐదేళ్లలో డీజిల్, పెట్రోల్ వాహనాలు భారీగా తగ్గుతాయ్: ఆర్టీసీ ఎండీ



2లో

## ఎల్బీనగర్‌లో దారుణం..

9 నెలల చిన్నారిని నీటిలో ముంచి చంపిన తల్లి



2లో

## దివ్యాంగులకు ట్రై మోటార్ సైకిళ్లను పంపిణీ చేసిన మంత్రి కొల్లు



మచిలీపట్నం: కృష్ణా జిల్లా మచిలీపట్నంలో దివ్యాంగులకు మూడు చక్రాల మోటార్ వాహనాలను మంత్రి కొల్లు రవీంద్ర పంపిణీ చేశారు. మొత్తం 48 మంది లబ్ధిదారులకు అందజేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1800 మందికి వాహనాలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా మంత్రి అన్నారు. 70 శాతానికి పైగా అంగవైకల్యం కలిగి, పదోతరగతి చదువుకున్న వారికి సుమారు రూ.1.15 లక్షల విలువైన ట్రై సైకిల్స్ పంపిణీ చేసినట్లు చెప్పారు. దివ్యాంగుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని వెల్లడించారు.

## ధరల స్థిరీకరణకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

### ధరల నియంత్రణకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు.



- రూ.52కే నాణ్యమైన బీపీటీ స్టీమ్ రైస్.
- రూ.50కే బీపీటీ పచ్చి బియ్యం.
- 150 రైతు బజార్లు, 500 రైస్‌మిల్ అవుట్‌లెట్లలో విక్రయాలు.
- బియ్యం ధరల పెరుగుదలపై ప్రభుత్వ కీలక నిర్ణయం.
- కందిపప్పు, పామాయిల్ ధరల నియంత్రణపై దృష్టి.
- వినియోగదారుల ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యం.

విజయవాడ: ధరల స్థిరీకరణకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం విజయవాడ ఆటోనగర్‌లోని ఏపీఐఐసీ రైతు బజార్‌లో వినియోగదారులతో మాట్లాడారు. వినియోగదారులకు భారీ ఊరటగా రూ.52లకే కిలో నాణ్యమైన బియ్యం అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. 150 రైతు బజార్లు, 500 రైస్‌మిల్ అవుట్‌లెట్లలో ఆదివారం నుంచే విక్రయాలు ప్రారంభించామన్నారు. బియ్యం ధరల పెరుగుదల నేపథ్యంలో వినియోగదారులకు ఉపశమనం కల్పించేందుకు కీలక నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో కిలోకు సుమారు రూ.10 వరకు ధరలు పెరిగినట్లు గుర్తించామన్నారు. ఆంధ్రప్రదేశ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌తో కలిసి తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం సరఫరా చేసేందుకు నిర్ణయించినట్లు చెప్పారు.

2లో

# సంపాదకీయం

## భారతీయ బహుళత్వమే నియంతృత్వం నుంచి రక్ష!



నేటి హిందుత్వ భావజాలం భారతీయ భక్తిమార్గంలోని లలితమైన బహుళత్వాన్ని, స్వేచ్ఛను తుడిచిపెడుతోంది.
పాశ్చాత్య మతాలలోని 'ప్రభువు' భావనను అరువు తెచ్చుకుని, ఒక సర్వాధికారిని, ఒక నియంతను ఆరాధించే సంస్కృతిని హిందూ సమాజంలోకి చొప్పిస్తోంది. దేవుడిని సైతం ఒక రాజకీయ పాలకుడిగా, అధికార కేంద్రంగా మార్చే ప్రక్రియ ఇది.దేవానాంప్రియ తన సామ్రాజ్యంలో ఉన్న ఆటవిక తెగలను (గిరిజనులను) అనునయిస్తున్నాడు. అదే సమయంలో తన వద్ద ఉన్న శక్తిని (శిక్షించే అధికారాన్ని) వారికి గుర్తుచేస్తున్నాడు.
-- సామ్రాట్ అశోక 13వ రాతిశాసనం
జాతీయ రాజ్యం ఏర్పాటులోనే నియంతృత్వానికి సంబంధించిన బీజాలు అంతర్గతంగా ఉన్నాయి. అయితే, భారతదేశంలో శతాబ్దాలుగా వర్ధిల్లిన స్థానిక సంప్రదాయక బహుళత్వం ఆ నియంతృత్వాన్ని ఒక పెద్ద వృక్షంగా ఎదగకుండా అడ్డుకుంటూ వచ్చింది. జాతీయవాదం, జాతీయ రాజ్యం అనేవి కాలక్రమేణా కేంద్రీకృత నియంతృత్వానికి దారితీస్తాయని రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి వారు స్వాతంత్ర్య ఉద్యమ కాలంలోనే గుర్తించి హెచ్చరించారు. గాంధీ కూడా ఈ ప్రమాదాన్ని గ్రహించి, బహుళత్వాన్ని జాతీయవాదంతో మిళితం చేయడానికి ప్రయత్నించారు.
భారత రాజ్యాంగం పౌరులకు జీవించే హక్కు, మాట్లాడే హక్కు వంటి ప్రాథమిక హక్కులను హామీ ఇచ్చింది. కానీ, జాతీయ రాజ్యానికి భౌగోళిక సరిహద్దులు ఎంత ముఖ్యమో, పౌరుల హక్కులపై రాజ్యానికి ఉండే నియంత్రణకూ అంతే బలమైన సరిహద్దులు ఏర్పడ్డాయి. ఆ సరిహద్దుల పేరే 'ప్రివెంటివ్ డిటెన్షన్ లా' (నిరోధక నిర్బంధ చట్టం). భౌతికశాస్త్రంలో 'బ్లాక్ హోల్'లో సర్వ భౌతిక సూత్రాలు ఎలాగైతే విఫలమవుతాయో, ఈ ప్రివెంటివ్ డిటెన్షన్ పరిధిలోకి వచ్చాక పౌరులకు రాజ్యాంగం ఇచ్చిన అన్ని ప్రాథమిక హక్కులు పోతాయి.
సాధారణ చట్టాల ప్రకారం ఒక వ్యక్తిని అరెస్టు చేసినప్పుడు లభించే కనీస రక్షణలు కూడా ఇందులో ఉండవు. రాజ్యాంగంలోని ఈ నిబంధనల నుంచి పుట్టిన సంతానమే నేటి ఉపా (ఖ్యూూూ) వంటి నల్ల చట్టాలు. న్యాయస్థానాలు, ప్రభుత్వాలు చేతులు కలిపి ప్రజల హక్కులను నిరాకరించడం భారత చరిత్రలో కొత్తేమీ కాదు. కానీ, నేడు పౌర సమాజంలో పెరిగిన హిందూత్వ భావజాలం, హిందూ జాతీయవాదం ఇటువంటి ప్రజావ్యతిరేక చట్టాలకు, రాజ్య హింసకు పౌరుల నుంచే ఒక విస్తృతమైన 'సమ్మతి' (జశీఅంవత్) లభించేలా చేస్తున్నాయి. అసలైన ప్రమాదం ఇక్కడే పొంచి ఉంది.
అంబేద్కర్, నెహ్రూలతో సహా ఆధునిక భారత నిర్మాతలంతా కేంద్రీకృత రాజ్యాన్ని గత సమాజంలోని మూర్ఖత్వాలు, సంకుచితత్వాలు, భూస్వామ్య దొరతనం, కులతత్వం నుంచి లభించే విముక్తిగా భావించారు. ఆ విముక్తి కోసమే వారు కేంద్రీకృత రాజ్యాన్ని బలపరచాలని నమ్మారు. ఆ రాజ్యాన్ని నిలపడం కోసం, దేశ సమగ్రత కోసం అవసరమైతే పౌరుల హక్కులను కుదించవచ్చని వారు భావించారు. దాని ఫలితమే రాజ్యాంగంలో నిర్బంధ చట్టాలకు చోటు దక్కడం. దీనివల్ల భారతదేశంలో ప్రభుత్వాలు అనేకసార్లు పేదలు, మైనారిటీల పట్ల వివక్షాపూరితంగా వ్యవహరించాయని మేధావులు, జర్నలిస్టులు నిరంతరం స్పష్టం చేస్తూనే ఉన్నారు. రాజ్యం రహస్యంగా హక్కులను హరించడం ఒక ఎత్తయితే, ఇప్పుడు పౌర సమాజంలోనే ఆ హక్కులు హరించడాన్ని సమర్థించేలా ఒక ఉన్మాద భావజాలం వ్యాప్తి చెందడం పెద్ద విషాదం.

## రైతు బజార్లో తక్కువ ధరలకే బియ్యం విక్రయం

**రైతు బజార్ లో బియ్యం విక్రయాల కౌంటర్ ను ప్రారంభించిన**
**ఎమ్మెల్యే అంజిబాబు, జిల్లా కలెక్టర్ నాగరాణి**

**భీమవరం ఆగష్టు 02 జనసముద్రం ప్రతినిధి**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సామాన్య ప్రజలకు ఉపశమనం కలిగిస్తూ రైతు బజార్లో రాష్ట్ర వ్యాప్తంగా తక్కువ ధరలకే బియ్యం విక్రయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం రైతు బజార్ లో ఆదివారం తగ్గింపు ధరలకు బియ్యం విక్రయాలను కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే అంజిబాబు, జేసి కల్పశ్రీ లు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ బీపీటీ స్టీమ్ సూపర్ ఫైన్ బియ్యం కిలో రూ. 62 ఉండగా రైతు బజార్లో రూ 52 లకు, బీపీటీ రా బియ్యం బయట రూ 58 ఉండగా రైతు బజార్లో రూ 50 లకు అందించడం జరుగుతుందని, ఒక్కో లబ్ధిదారునికి 10 కేజీల చొప్పున బియ్యం అందించడం జరుగుతుందన్నారు. 115 రైతు బజార్లలోనూ, 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక పాయింట్లలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటలకు అందిస్తారని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే అంజిబాబు కోరారు. బహిరంగ మార్కెట్లో ధరల భారం నుంచి సామాన్య, మధ్యతరగతి కుటుంబాలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. జాయింట్ కలెక్టర్ కల్పశ్రీ, వివిధ కార్పోరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, అధికారులు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు తెలుగు మహిళలు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మకు ఆషాడం సారె సమర్పించిన ప్రముఖ వ్యాపారవేత్త కారుమూరి శ్రీకాంత్

**మొగల్తూరు, ఆగస్టు 2 జనసముద్రం ప్రతినిధి**

మొగల్తూరు నడివీధిలో కొలువై ఉన్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారికి ప్రముఖ వ్యాపారవేత్త కారుమూరి శ్రీకాంత్ కుటుంబ సమేతంగా ఆషాడం సారె సమర్పించారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు.
ఈ సందర్భంగా అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, పండ్లు, పూలతో సారె సమర్పించి ప్రత్యేక హారతులు ఇచ్చారు. కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, వ్యాపారాభివృద్ధి, ప్రజలందరికీ సుఖశాంతులు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బంధుమిత్రులు, భక్తులు పాల్గొన్నారు.

## ఉత్సవాల నిర్వహణకు బిచ్చమెత్తుకోవాలా?:

మొదటిపేజీ తరువాయి
సికింద్రాబాద్: సికింద్రాబాద్ మహాకాళి అమ్మవారిని కేంద్ర మంత్రి బండి సంజయ్ దర్శించుకున్నారు. బోనాల ఏర్పాట్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉత్సవాల నిర్వహణ కోసం బిచ్చమెత్తుకోవాలా?అని ప్రశ్నించారు. జంటనగరాల్లో 3 వేలకు పైగా ఆలయాల్లో బోనాల ఉత్సవాలు జరుగుతాయని, అందుకు రూ.20 కోట్లు సరిపోతాయా? అని ప్రశ్నించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం బోనాలకు నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. జనాభా ప్రాతిపదికన పండుగలు, ఉత్సవాలకు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు

## వచ్చే ఐదేళ్లలో డీజిల్, పెట్రోల్ వాహనాలు భారీగా తగ్గుతాయ్: ఆర్టీసీ ఎండీ

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: ప్రజారవాణా వ్యవస్థలో ఎలక్ట్రిక్ బస్సులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలంగాణ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. బేగంపేటలోని ఐఏఎస్ ఆఫీసర్స్ క్లబ్‌లో కీటో మోటార్స్ ఈవీ బస్సును కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆర్టీసీ 1,050 ఎలక్ట్రిక్ బస్సులు నడిపిస్తోందని, పీఎం ఈ డ్రైవ్ కింద 2,200 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని తెలిపారు. "ఇంటర్ సిటీ ఆపరేషన్స్‌లో 500 బస్సులు వినియోగిస్తున్నాం. వచ్చే ఐదేళ్లలో డీజిల్, పెట్రోల్ వాహనాలు భారీగా తగ్గుతాయి. లాస్ట్‌మైల్ కనెక్టివిటీ కోసం ఆర్టీసీ ప్రణాళికలు రచిస్తోంది" అని నాగిరెడ్డి తెలిపారు.

## వైకాపా హయాంలో రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేశారు:

మొదటిపేజీ తరువాయి
రేపల్లె: వైకాపా హయాంలో రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేశారని మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. బాపట్ల జిల్లా రేపల్లెలో నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వపాలన గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళా సాధికారిత కోసం ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు.

## ఎల్బీనగర్‌లో దారుణం..

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: ఎల్బీనగర్ సమీపంలోని బైరామల్ గూడాలో దారుణం చోటు చేసుకుంది. రాజేశ్వరి అనే మహిళ తన 9 నెలల కుమార్తె అనురాధను చెరువులో ముంచి చంపేసింది. మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. నిందితురాలిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ధరల స్థిరీకరణకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

మొదటిపేజీ తరువాయి
బీపీటీ స్టీమ్ రైస్‌ను రూ.64-65 నుంచి తగ్గించి రూ.52లకే అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. బీపీటీ పచ్చి బియ్యం రూ.58-60 నుంచి తగ్గించి రూ.50లకే నిర్ణయించినట్లు తెలిపారు. నేటి నుంచే సబ్సిడీ ధరల విక్రయాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమవుతాయన్నారు. కందిపప్పు, పామాయిల్ ధరల నియంత్రణపై కూడా ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. వినియోగదారుల ప్రయోజనాలే లక్ష్యంగా నిరంతరం చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## 60 ఏళ్లుగా భారత్‌లోనే చైనా సైనికుడు.. కుల ధ్రువీకరణ కోసం పోరాటం

మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లా తిరోడిలో 60 ఏళ్లుగా భారత్‌లోనే నివసిస్తున్న చైనాకు చెందిన మాజీ సైనికుడి కుటుంబం ఇప్పుడు కుల ధ్రువీకరణ పత్రం సమస్యను ఎదుర్కొంటోంది. స్థానిక ప్రభుత్వం నుంచి కుల ధ్రువీకరణ పత్రం పొందడం ఆ కుటుంబానికి పెద్ద సవాల్‌గా మారింది. దీనిపై వాంగ్ కీ కుమారుడు విష్ణు వాంగ్ మాట్లాడుతూ.. "మేం ఇక్కడే పుట్టాం. మేమే భారతీయులమే. అయితే మాకు ఇక్కడ ఎలాంటి సౌకర్యాలు కల్పించకుంటే మమ్మల్ని తిరిగి చైనాకే పంపించేయండి. మా నాన్నకు ఇప్పుడు 86 ఏళ్లు. తన జీవితంలో ఎక్కువ భాగం ఇక్కడే గడిపాడు. నా కుమార్తెకు ఇప్పుడు 14 ఏళ్లు. కుమారుడు థర్డ్ గ్రేడ్ చదువుతున్నాడు. మా పిల్లలకు కుల ధ్రువీకరణ పత్రాల కోసం సమస్యలు ఎదుర్కొంటున్నాం. చట్టపరంగానే దరఖాస్తు చేసినప్పటికీ మా తండ్రి చైనీయుడు కావడం వల్ల ఇబ్బందిగా మారింది. తండ్రి కులం ఆధారంగా ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తామని అధికారులు చెబుతున్నారు. మా తండ్రికి సంబంధించిన సరైన వివరాలు డాక్యుమెంట్లలో లేవు. మా కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. డబ్బులు పెట్టి కోర్టుల చుట్టూ తిరగలేం' అని విష్ణు వాంగ్ ఆవేదన వ్యక్తం చేశాడు.



1962 ఇండియా-చైనా యుద్ధ సమయంలో గూఢచర్యం కేసులో అరుణాచల్ ప్రదేశ్‌లో వాంగ్ కీని భారత బలగాలు అరెస్టు చేశాయి. అనంతరం అతడిని పలు జైళ్లలో ఉంచారు. ఏడేళ్ల జైలు శిక్ష అనంతరం వాంగ్ కీ 1969లో విడుదల అయ్యారు. అనంతరం అతడు మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లా తిరోడిలో ఉండిపోయాడు. పిండిమిల్లు నడుపుకుంటూ స్థానిక మహిళను వివాహం చేసుకున్నాడు. వారికి ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు జన్మించగా, వారికి సైతం పెళ్లిళ్లు జరిగి పిల్లలు పుట్టారు.

## జులైలో శ్రీవారికి రికార్డు స్థాయి హుండీ ఆదాయం!



తిరుమల: తితిదే చరిత్రలోనే అత్యధిక నెలవారీ హుండీ ఆదాయం నమోదైనట్లు తితిదే అధికారులు తెలిపారు. ఒక్క జులై నెలలో స్వామి వారికి రూ.140.28 కోట్ల హుండీ ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు. ఇది తితిదే చరిత్రలోనే అత్యధిక నెలవారీ హుండీ సేకరణగా నిలిచింది. అదే నెలలో 24.52 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

## ప్రధాని నిర్ణయంతో నా కుమార్తెకు పునర్జన్మ:

మొదటిపేజీ తరువాయి
పేపర్‌లీక్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన నిరసనల్లో భాగంగా ప్రధాని మోదీ (్రావీ ఛ్ఖితీవఅనతీఖ వీశీఅఱ)పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినందుకు నోయిడా పోలీసులు ఓ బాలికపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే ఆమె తన తప్పు తెలుసుకుని ప్రధాని మోదీకి క్షమాపణలు చెప్పిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై బాలిక తల్లి స్పందిస్తూ.. తన కుమార్తెను క్షమించినందుకు ప్రధానికి కృతజ్ఞతలు తెలియజేశారు. "ప్రధాని క్షమించడంతో నా కుమార్తెకు కొత్త జీవితం లభించింది. అభ్యంతరకరమైన పదాలను ఉపయోగించినా.. క్షమించి ఆయన గొప్ప మనసును చాటుకున్నారు. ఇవాళ నా కుమార్తె పుట్టినరోజు. ఆమెకు ప్రధాని అత్యంత గొప్ప కానుకగా కొత్త జీవితాన్ని ఇచ్చారు. ఈరోజు ఆమెకు పునర్జన్మ లభించింది" అని పేర్కొన్నారు.
మైనర్లను సోషల్ మీడియా వాడకుండా.. నిరసనల్లో పాల్గొనకుండా నిషేధం విధించాలని బాలిక తల్లి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తన కుమార్తెపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో పోలీసులు ఆమె వయసు 25ఏళ్లుగా నమోదు చేశారని.. కానీ ఆమె వయసు 15 ఏళ్లే అని పేర్కొన్నారు. తన కుమార్తెపై నమోదు చేసిన కేసును కొట్టివేయించాలని ప్రధానిని కోరారు. తప్పు తెలుసుకొని క్షమాపణ చెప్పినప్పటికీ.. ఆమెకు సోషల్ మీడియాలో బెదిరింపులు వస్తున్నాయన్నారు. ఈ విషయంలో అధికారులు జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాగా బాలిక మరోసారి ప్రధాని మోదీకి క్షమాపణలు తెలియజేసింది. నిరసనల్లో భాగంగా కొందరి ప్రభావానికి లోనైన తాను ప్రధానికి (్రావీ వీశీఅఱ) వ్యతిరేకంగా చెడు మాటలు మాట్లాడానని పేర్కొంది.

## సీజేపీ భవిష్యత్ కార్యాచరణ.. ఆగస్టు 5న కీలక సమావేశం

మొదటిపేజీ తరువాయి
కాక్రోచ్ జనతా పార్టీ తదుపరి కార్యాచరణపై దృష్టి సారించింది. పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే నివాసంలో (మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్) ఈ నెల 5న కోర్ కమిటీ సమావేశం జరగనుంది. వాలంటీర్లు, విద్యార్థుల అభిప్రాయాలను సేకరించి సమావేశానికి రావాలని సభ్యులు నిర్ణయించుకున్నారు. ఈ ఉద్యమాన్ని క్షేత్రస్థాయికి ఎలా తీసుకెళ్లాలి, విద్యార్థులపై నమోదైన కేసుల ఉపసంహరణ విషయమై కేంద్రంపై ఎలా ఒత్తిడి తీసుకురావాలనే అంశాలపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది. అనంతరం విలేకరుల సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నారు. ఇదిలా ఉండగా స్నేహితుల దినోత్సవం సందర్భంగా చిన్నారులతో కలిసి దీప్కే ఆదివారం వేడుకలు నిర్వహించారు
నీట్ ఎఫెక్ట్.. రూ.7.5 కోట్లతో భద్రతకు టెండర్ల ఆహ్వానం
నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వివాదం నేపథ్యంలో ఎన్‌టీఏ పరీక్షల భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తోంది. ప్రధాన కార్యాలయం, ప్రాంతీయ కార్యాలయాలు, సర్వర్ గదులు, స్ట్రాంగ్‌రూమ్‌లు, ప్రశ్నపత్రాల నిల్వ కేంద్రాలకు 24 గంటల భద్రత కల్పించేందుకు సుమారు రూ.7.5 కోట్లతో టెండర్‌ను ఆహ్వానించింది. రెండేళ్ల పాటు అమలయ్యే ఈ ఒప్పందానికి ఆగస్టు 17 వరకు బిడ్లు స్వీకరించనుంది. భద్రతతో పాటు హౌస్‌కీపింగ్, సెక్యూర్ ప్రింటింగ్ (అత్యంత సురక్షితంగా ప్రశ్నపత్రాల ముద్రణ) కోసం టెండర్లను ఆహ్వానిస్తోంది.

## లోకేశ్ సమక్షంలో..

### ఏపీ ప్రభుత్వం-ఆస్ట్రేలియా మధ్య కీలక ఒప్పందాలు

దీని ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను సోలార్ పీవీ తయారీ, సోలార్ ప్యానెళ్ల రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ పరిశోధనలకు జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దడమే కాకుండా, పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా ఖచీూఔ ప్రత్యేక విద్యా శిక్షణా కార్యక్రమాలను రూపొందిస్తుంది. సమ్మిళిత విద్యను బలోపేతం చేసేందుకు ఖచీూఔ, శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఏపీ సమగ్ర శిక్ష కలిసి ఆటిజం, న్యూరోడైవర్స్ విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయుల సామర్థ్యం పెంపునకు మరో ఒప్పందం చేసుకున్నాయి. విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిరక్షణ కోసం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, ఆస్ట్రేలియాకు చెందిన రీబౌండ్ డింపుల్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా ఎంపిక చేసిన విద్యాసంస్థల్లో ఉచితంగా సాంకేతిక ఆధారిత వర్చువల్ కౌన్సెలింగ్ పైలట్ ప్రాజెక్టును అమలు చేయనున్నాయి. అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు, వృత్తి విద్యా సర్టిఫికేషన్ కోసం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఆస్ట్రేలియాకు చెందిన డైనమిక్ లెర్నింగ్ సర్వీసెస్‌ల మధ్య నాలుగో ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందాలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబును ఆస్ట్రేలియా సహాయ మంత్రి జూలియన్ హిల్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలుసుకుంది. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని, పెట్టుబడులకు గల విస్తృత అవకాశాలను ఆస్ట్రేలియా బృందానికి సీఎం వివరించారు.

## భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక రెవెన్యూ క్లినిక్



విజయనగరం రూరల్: ప్రజల సమస్యలకు వేగవంతమైన, పారదర్శక పరిష్కారం అందించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కలెక్టరేట్ ఆడిటోరియంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. జిల్లా స్థాయి శాఖల అధికారులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతారని పేర్కొన్నారు. ప్రజలు తమ దరఖాస్తుల్లో పేరు, చిరునామా, మొబైల్ నంబర్‌తోపాటు సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలు, ఆధార పత్రాలను జతపరచాలని సూచించారు. గతంలో ఫిర్యాదు చేసిన వారు పాత అర్జీ రశీదును తప్పనిసరిగా వెంట తీసుకురావాలని తెలిపారు.
అర్జీల స్థితిగతులను ప్రజలు సులభంగా తెలుసుకునేలా ప్రభుత్వం ఎస్ఎంఎస్ సేవలను అందుబాటులో ఉంచిందని, సమస్య పరిష్కారం అనంతరం సంబంధిత ఉత్తర్వులు, ఎండార్స్‌మెంట్లు వాట్సప్, రిజిస్టర్ పోస్టు ద్వారా పంపిస్తామని వెల్లడించారు. కలెక్టరేట్‌కు హాజరు కాలేని వారు 1100 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా, ఎవవనిశీఖఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. మండల, మున్సిపల్ కార్యాలయాల్లో అర్జీలు సమర్పించవచ్చన్నారు.

**భూ సమస్యలకు ప్రత్యేక పరిష్కార వేదిక**
ప్రభుత్వ ఆదేశాల మేరకు భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో 'రెవెన్యూ క్లినిక్' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్లినిక్‌కు ఆర్డీవోలు, తహసీల్దార్లు, రెవెన్యు సిబ్బంది హాజరవుతారని చెప్పారు. భూ వివాదాలు, మ్యుటేషన్లు, సర్వేలు, ఇతర రెవెన్యూ సమస్యలు ఎదుర్కొంటున్న రైతులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం పొందాలని రాంసుందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# సంకటహర చతుర్థి సందర్భంగా రుద్రేశ్వర ఆలయంలో విశేష పూజలు

**●ఉత్తిష్ఠ గణపతికి నవరసాభిషేకం -- రుద్రేశ్వరునికి 51 కిలోల పెరుగు అన్నంతో అన్నపూజ**

**హనుమకొండ, ఆగస్టు 2 (జనసముద్రం)**



సంకటహర చతుర్థి సందర్భంగా ఆదివారం చారిత్రక రుద్రేశ్వర స్వామి వేయి స్తంభాల దేవాలయంలో విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తిష్ఠ గణపతికి నవరసాభిషేకం, పంచామృతాభిషేకం, హరిద్రా--కుంకుమ విలేపనాభిషేకం ఘనంగా నిర్వహించారు. అనంతరం రుద్రేశ్వర స్వామికి రుద్రాభిషేకం చేసి, 51 కిలోల పెరుగు అన్నం, మిరియాల పొడితో స్వామివారిని రుద్ర గణపతి అలంకారంలో అలంకరించి అన్నపూజ, పుష్పార్చన నిర్వహించారు. ఈ అన్నపూజ కార్యక్రమాన్ని హైదరాబాద్‌కు చెందిన పరమశివ భక్తులు శ్రీ వెంకట సాయి ఆనంద విశ్వనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ, శీఘ్ర ప్రసాదకుడైన మహాగణపతిని దర్శించి భక్తిశ్రద్ధలతో పూజిస్తే గురు బలం కలుగుతుందని, సర్వపాపాలు నశించి సకల కార్యసిద్ధి కలుగుతుందని తెలిపారు. గణపతి ఉపనిషత్, గణపతి సూక్తాల్లో కూడా గణపతి ఆరాధన మహిమను విశదీకరించారని వివరించారు. ఈ సందర్భంగా తెలుగు అకాడమీ చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ తన బంధువులతో కలిసి ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు వారికి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ, వేదపండితులు మణికంఠ శర్మ వేదోక్తంగా నిర్వహించగా, ఆలయ కార్యనిర్వహణాధికారి డి. అనిల్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

# తిమ్మాపురంలో సీపీఐ పాదయాత్రలు, 'చలో ఢిల్లీ' గోడపత్రికల ఆవిష్కరణ.

**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా ఆగస్టు 2 ద్వారకాతిరుమల ప్రతినిధి.**



కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వర రావు పిలుపునిచ్చారు. ఆగస్టు 6 నుంచి 15వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న పాదయాత్రలు, ప్రచార ఆందోళనలతో పాటు, సెప్టెంబరు 1న తలపెట్టిన 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఆదివారం నాడు ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురంలో సీపీఐ మండల కార్యదర్శి గోలిమే బాలయేసు ఆధ్వర్యంలో పాదయాత్ర, 'చలో ఢిల్లీ' గోడపత్రికలను బండి వెంకటేశ్వర రావు పార్టీ కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వెంకటేశ్వర రావు మాట్లాడుతూ.. కేంద్రంలో 12 సంవత్సరాలుగా ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా వైఫల్యం చెందాయని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారా లేదా అని ప్రజలు ప్రజాప్రతినిధులను నిలదీయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో మెట్ట ప్రాంత వరప్రదాయిని అయిన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని తక్షణమే పూర్తి చేయాలని, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని అమలు చేసి, భూములు త్యాగం చేసిన రైతులకు పూర్తి నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై పోరాడేందుకు ఈ నెల 6 నుంచి 15 వరకు జరిగే పాదయాత్రల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని కోరారు.

సీపీఐ ద్వారకాతిరుమల మండల కార్యదర్శి గోలిమే బాలయేసు మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, 'వికసిత్ భారత్' జీ రాంజీ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ద్వారకాతిరుమల మండలంలో ఇంటి స్థలం లేని పేదలందరికీ మూడు సెంట్ల చొప్పున స్థలమిచ్చి, ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ నెల 11వ తేదీన ద్వారకాతిరుమల మండలంలో సీపీఐ ఆధ్వర్యంలో ప్రచార ఆందోళన పాదయాత్ర కొనసాగుతుందని ఆయన తెలిపారు.

ఈ గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ద్వారకాతిరుమల మండల కార్యదర్శి యడ్లపల్లి రమేష్, సీపీఐ, బీకేఎంయూ నాయకులు గుదే ఆశీర్వాదం, ఏపూరి వెంకన్న, యడ్లపల్లి సుబ్బారావు, ఏపూరి రాములు, పొనుకమాటి వెంకట్రావు, పెండ్లి గంగరాజు, తవిడిపూడి యేసు, యడ్లపల్లి లక్ష్మి, ఏపూరి శ్యామల, డొక్కా బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వేయి స్తంభాల దేవాలయాన్ని సందర్శించిన తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ

**●సంకటహర చతుర్థి సందర్భంగా ఆలయ అర్చకులు గంగు ఉపేందర్ శర్మ విశేష పూజలు**

**ఎల్కతుర్తి, ఆగస్టు 2 (జనసముద్రం)**



సంకటహర చతుర్థి సందర్భంగా ఆదివారం చారిత్రక రుద్రేశ్వర స్వామి వేయి స్తంభాల దేవాలయంలో విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తిష్ఠ గణపతికి పంచామృతాభిషేకం, జలనారికేళాభిషేకం, హరిద్రా--కుంకుమ విలేపనాభిషేకం నిర్వహించారు. అనంతరం రుద్రేశ్వర స్వామికి రుద్రాభిషేకం వేదోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుడు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ తన బంధువులతో కలిసి దేవాలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికి గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నాట్యమండపంలో శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ, తెలంగాణలో కాకతీయుల కాలం నాటి ఇలాంటి చారిత్రక దేవాలయాలు ఉండటం గొప్ప అదృష్టమని అన్నారు. ఈ వారసత్వ కట్టడాలను పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు ఈ చారిత్రక సంపదను అందించాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపారు. చారిత్రక దేవాలయాల అభివృద్ధి, పరిరక్షణ కోసం కేంద్ర పురావస్తు శాఖ మరింత చొరవ చూపాలని, సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని కోరారు. కాకతీయులు మనకు అందించిన అపూర్వ వారసత్వాన్ని విద్యార్థులు సందర్శించి చరిత్రను తెలుసుకోవడం ద్వారా తమ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ, వేద పండితులు మణికంఠ శర్మ వేదోక్తంగా నిర్వహించగా, ఆలయ కార్యనిర్వహణాధికారి డి. అనిల్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

# మంచితనం మానవత్వం లేని ఏ మతమైనా సంస్కరించబడాల్సిందే

**జనసముద్రం ప్రతినిధి జడల గంగాధర్ నందిపేట్ 2**



మంచితనం మానవత్వం లేని ఏ మతమైనా సంస్కరించబడాల్సిందే....

సమాజంలో ఐక్యతకు, భద్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలి...

దేశాభివృద్ధికి, శాంతికి అవసరం.... పి ఆర్ టి యు తెలంగాణ జిల్లా గౌరవ అధ్యక్షులు కృపాల్ సింగ్ సోడి.

నేడు నిజామాబాద్ లోని అర్సపల్లి దగ్గర గల నిజాం ప్యాలెస్ ఫంక్షన్ హాల్ లో మతసామరస్యం, సోదర భావం, ప్రస్తుత సమాజంలో అనే శీర్షికపై ముఖ్యఅతిథిగా హాజరై కృపాల్ సింగ్ సోడి మాట్లాడుతూ సర్వమత సమానత్వమే మానవత్వం అని, అన్నీ మాతములను గౌరవించడం, పరస్పర ప్రేమ, శాంతి మరియు సయోధ్యతో కలిసి జీవించడం, వరదలు భూకంపాలు వచ్చినప్పుడు కుల మతం చూడకుండా అందరూ కలిసి బాధితులకు ఆహారం, వస్తువులు అందించడం ఆపదలో ఉన్న పేదలకు ప్రతిఫలం ఆశించకుండా సహాయం చేయడం, వృద్ధులు మరియు చిన్నారుల పట్ల ఆప్యాయత చూపడం నిజమైన సోదర భావం అని కొనియాడారు. ఇంతే కాకుండా మంచి చెడ్డ రెండే మతములని, సమాజంలో ఐక్యతకు భద్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలని, విద్యా ఆరోగ్యం సమాన అవకాశాలు ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని ఆ దిశగా ప్రతి ఒక్కరు అడుగు ముందుకు వేస్తే స్వేచ్ఛ శాంతితో నవ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని, మంచితనం, మానవత్వం లేని ఏ మతమైనా సంస్కరించబడాల్సిందే అని తెలిపారు.

# రేగా కాంతారావుపై కఠిన చర్యలు తీసుకోవాలి: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 2 (జనసముద్రం న్యూస్):**



కరకగూడెం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై నమోదైన లైంగిక వేధింపుల ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరిపి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసే ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై బీఆర్ఎస్ పార్టీ నైతిక బాధ్యతతో క్రమశిక్షణ చర్యలు తీసుకుని, అవసరమైతే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. అలాగే గత పదేళ్లలో పినపాక నియోజకవర్గ అభివృద్ధిలో బీఆర్ఎస్ విఫలమైందని, ప్రస్తుతం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి ఎర్ర సురేష్, మాజీ సర్పంచ్ తోలెం నాగేశ్వరరావు, కరకగూడెం సర్పంచ్ పోలేబోయిన సుజాత, ఉపసర్పంచ్లు పూజారి వెంకన్న, ఈసం కోటేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ కొమరం వెంకటేశ్వర్లు, మండల నాయకులు షేక్ రఫీ, జలగం కృష్ణ, భూక్యా రాందాస్, వార్డు సభ్యురాలు నిర్మల, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 39 ఏళ్ల స్నేహబంధానికి సాక్షిగా గోపాల్పూర్‌లో ఫ్రెండ్షిప్ డే వేడుకలు

**●1987--88 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక**

**ఎల్కతుర్తి, ఆగస్టు 2(జనసముద్రం)**



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని గోపాల్పూర్ గ్రామంలో 1987--88 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఫ్రెండ్షిప్ డే సందర్భంగా ఆత్మీయంగా సమావేశమై వేడుకలను ఘనంగా నిర్వహించారు. దాదాపు 86 మంది పూర్వ విద్యార్థులు ఒకేచోట చేరి ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటూ, ఫ్రెండ్షిప్ డే శుభాకాంక్షలు తెలుపుకుంటూ తమ పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. సుమారు 39 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న ఈ స్నేహితులు నేటికీ అదే ఆప్యాయత, అనుబంధంతో కలిసికట్టుగా ఉండటం అందరినీ ఆకట్టుకుంది. ప్రతి ఏడాది ఇలాగే సమావేశమవుతూ స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని, అందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బ్యాచ్ అధ్యక్షుడు మంగలంపల్లి సంపత్ కుమార్ మాట్లాడుతూ, గెట్ టుగెదర్ ప్రారంభమైనప్పటి నుంచి అందరూ ఐక్యంగా కొనసాగుతున్నారని, ఈ స్నేహబంధం ఎప్పటికీ విడిపోకుండా ప్రతి సంవత్సరం ఫ్రెండ్షిప్ డే వేడుకలను మరింత ఉత్సాహంగా నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు. అందరూ ఐకమత్యంతో ముందుకు సాగాలని సూచించారు.

బోయినపల్లి తిరుపతిరావు మాట్లాడుతూ, స్నేహబంధం అనేది మాటల్లో చెప్పలేనంత గొప్పదని, అవసరమైతే ప్రాణాలకైనా నిలబడే బంధమని పేర్కొన్నారు. 39 సంవత్సరాలుగా ఎలాంటి విభేదాలు లేకుండా స్నేహితులందరూ కలిసికట్టుగా కొనసాగడం గర్వకారణమని అన్నారు. బోయినపల్లి రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ, ఇప్పటికీ అందరూ ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసిమెలిసి ఉండటం ఈ బ్యాచ్ ప్రత్యేకత అని తెలిపారు. చిర్ర ఉదయచందర్ మాట్లాడుతూ, ఈ అనుబంధం శాశ్వతంగా కొనసాగాలని, ప్రతి సంవత్సరం ఇలాంటి సమావేశాలను నిర్వహిస్తూ స్నేహాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఆకాంక్షించారు. చివరగా బ్యాచ్ సభ్యులందరూ ఒకరికి ఒకరు ఫ్రెండ్షిప్ డే శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ, తమ స్నేహబంధం చిరస్థాయిగా కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమం ఆనందోత్సాహాల నడుమ ముగిసింది.

# కడ్తాల్‌కు ప్రభుత్వ దవాఖాన ఎప్పుడు..? ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి!






**●పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు -- ఎగిరిశెట్టి కర్ణాకర్ ఆవేదన**

**కడ్తాల్ న్యూస్ (ఆగస్టు 2) జనసముద్రం**

రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో తక్షణమే ప్రభుత్వ దవాఖాన ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త ఎగిరిశెట్టి కర్ణాకర్ ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని పేద, మధ్యతరగతి ప్రజలు చిన్నచిన్న అనారోగ్య సమస్యలకే ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని, దీనివల్ల వారి ఆర్థిక పరిస్థితి మరింత దెబ్బతింటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

కడ్తాల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లిన ప్రతి రోగికి కనీసం రూ.1,000 వరకు ఖర్చవుతోందని, పరీక్షలు, మందుల పేరుతో అదనపు భారం మోపుతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తక్కువ ధరలకు అందుబాటులో ఉంచిన జనరిక్ మందులను కూడా అధిక ధరలకు విక్రయిస్తూ ప్రజలను దోచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని ఆయన అన్నారు.

ప్రభుత్వం కడ్తాల్‌లో అన్ని విభాగాలతో కూడిన ప్రభుత్వ ఆస్పత్రిని ఏర్పాటు చేసి, అర్హులైన వైద్యులు, సిబ్బంది, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. దీంతో మండల ప్రజలకు నాణ్యమైన వైద్యం ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో లభిస్తుందని అభిప్రాయపడ్డారు.

### కడ్తాల్ ప్రజల ప్రధాన డిమాండ్లు

మండల కేంద్రంలో ప్రభుత్వ దవాఖాన ఏర్పాటు చేయాలిలి

అన్ని రకాల వైద్య సేవలు, పరీక్షలు అందుబాటులో ఉండాలి.

జనరిక్ మందుల విక్రయాలపై కఠిన తనిఖీలు నిర్వహించాలి.

ప్రైవేట్ ఆస్పత్రుల అధిక ఫీజులపై జిల్లా వైద్యశాఖ చర్యలు తీసుకోవాలి.

# చవితి పర్వదినం పురస్కరించు కొని ప్రత్యేక పల్లకి సేవ.. మరియు స్వామి వారికి పంచామృత అభిషేకం,





**●ముడుపు సమర్పణ ఉచిత అమృత నిర్గుండి కశాయం వితరణ**

**జనసముద్రం న్యూస్ జగిత్యాల జిల్లాఆగస్టు02**

ఆదివారం భానువాసరే ఆషాఢ మాసం శుక్ల పక్షం చవితి పర్వదినం సందర్భంగా శ్రీ సూర్య ధన్వంతరి ఉషా చాయ సమేత శ్రీ సూర్య నారాయణ స్వామి వారికి పంచామృత అభిషేకం

### సూర్య భగవానుని విశిష్టత :

ఆదివారం -- సూర్య భగవానుని ప్రత్యేక దినంఆదివారం హిందూ సాంప్రదాయంలో సూర్య భగవానుని (సూర్యుని)కి అంకితమైన పవిత్రమైన రోజు. ఈ రోజు సూర్యదేవుని ఆరాధించడం వల్ల ఆరోగ్యము, ఆయుష్మానుభవం, విజయం, ధనం, మరియు ప్రసిద్ధి లభిస్తాయని విశ్వాసం ఉంది. తదియపర్వదినం పురస్కరించుకొని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయములో శ్రీ సూర్య భగవానుకి, ప్రత్యేక పూజల అనంతరం ప్రత్యేక పల్లకి సేవ నిర్వహించడం జరిగినది. తదనంతరం అమృత నిర్గుండి కశాయం ఉచిత వితరణ చేయడం జరిగినది తదనంతరం సూర్య భగవాన్‌వ కు భక్తులు ముడుపులు కట్టారు యిట్టి కార్యక్రమములోఫౌండర్ ఉఛైర్మెన్ డాక్టర్ వడ్ల గట్ట రాజన్న,వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, కోశాధికారి గోపి-స్వాతి భారతల రాజసాగర్, యాంసాని శంకరయ్య,వేముల రాజేష్,ఎలిమేళ్ల సత్యనారాయణ,రెడ్డి, గంగమ్మ, నాగభూషణం అర్చకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.సూర్యుని మంత్రం.

# ఎన్టీఆర్ సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం పాల్గొన్న వేణు

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, ఆగష్టు 2;**



ఎన్టీఆర్ సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సంభోజు వేణు సచివాలయం సిబ్బంది తో కలిసి అర్హులైన లబ్ధిదారులకు ఎన్టీఆర్ సామాజిక పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ.. ప్రతి నెల ఒకటో తేదీ నాడే క్రమం తప్పకుండా అర్హులైన లబ్ధిదారులకు సామాజిక పెన్షన్లు అందజేయడం మంచి శుభ పరిణామం అని అన్నారు. ఈ పెన్షన్లు ప్రతి కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాయని తెలిపారు.

# ద్వారకాతిరుమలలో ఘనంగా 'మాదిగ మాస్టిన్స్' సాహస కళా ప్రదర్శన.

●అంతరించిపోతున్న ప్రాచీన కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్.

●జనసేన మహిళా నేత దిరిశిన ఫాతిమారాణి ఆధ్వర్యంలో వేడుకగా కార్యక్రమం.



**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా ఆగస్టు 2 ద్వారకాతిరుమల ప్రతినిధి.**

కాలక్రమేణా అంతరించిపోతున్న ప్రాచీన, జానపద కళలను పునరుద్ధరించి, భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. గోపాలపురం నియోజకవర్గం జనసేన మహిళా నేత దిరిశిన ఫాతిమారాణి ఆధ్వర్యంలో ద్వారకాతిరుమలలో నిర్వహించిన అరుదైన 'మాదిగ మాస్టిన్స్' సాహస కళా ప్రదర్శన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రాణాలను పణంగా పెట్టి కళాకారులు ప్రదర్శించిన ఒళ్ళు గగుర్పొడిచే సాహస కృత్యాలను ఎమ్మెల్యే శ్రద్ధగా తిలకించి, మంత్రముగ్ధులయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలుగు నేలపై ఎంతో ఘన చరిత్ర కలిగిన ప్రాచీన కళారూపాలు నేడు ఆదరణ కరువై కాలగర్భంలో కలిసిపోతుండటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీకలైన ఇలాంటి సాహస కళలను, కళాకారులను ఆదుకోవడానికి ప్రభుత్వ పరంగా తగిన ప్రోత్సాహం, మద్దతు అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కళాకారులను ప్రోత్సహించేందుకు తక్షణ సహాయం కింద తన వంతుగా రూ. 20,000 ఆర్థిక సహాయం అందజేశారు.

ఇలాంటి అరుదైన సాంప్రదాయ కళలను వెలికితీసి, సమాజంలో గుర్తింపు తీసుకురావాలనే ఉన్నతమైన ఆశయంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేసిన జనసేన నేత దిరిశిన ఫాతిమారాణి చొరవను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల ప్రధాన మంత్రి విశాఖపట్నం వచ్చినప్పుడు 13,000 మందితో థింసా నృత్యం చూసి మంత్రముగ్ధులైనట్లుగానే.. మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు కూడా ఈ కళా ప్రదర్శనను చూస్తే ఈ కళాకారుల జీవన స్థితిగతులు పూర్తిగా మారుతాయని అభిప్రాయపడ్డారు. ఈ కళాకారుల బతుకుదెరువును ప్రభుత్వం మరియు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి తగిన సహాయం అందేలా చూస్తానని భరోసా కల్పించారు. కార్యక్రమ నిర్వాహకురాలు, జనసేన మహిళా నేత దిరిశిన ఫాతిమారాణి మాట్లాడుతూ.. మన ప్రాచీన సంస్కృతికి, సాహస పటిమకు అద్దం పట్టే 'మాదిగ మాస్టిన్స్' కళారూపం మరుగున పడిపోకుండా చూడాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కళాకారులను ఆదుకునేందుకు ముందుకు వచ్చి చేయూతనందించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, స్థానిక ప్రముఖులు, కళాభిమానులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని, కళాకారుల సాహస ప్రదర్శనలను తిలకించి కరతాళ ధ్వనులతో అభినందనలు తెలిపారు.

# అమడుగురులో ఘనంగా పల్లె సింధూర రెడ్డి జన్మదిన వేడుకలు.

## భారీగా తరలివచ్చిన టిడిపి అభిమానులు.

**అమడగురు జనసముద్రం న్యూస్ 02/08/2026**





మండల పరిధిలోని స్థానిక బస్టాండ్ కూడలి స్వర్గీయ నందమూరి ఎన్టీఆర్ విగ్రహం కుడలు వద్ద పుట్టపర్తి శాసనసభ్యురాలు శ్రీమతి పల్లె సింధూర రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం నాడు అత్యంత వైభవంగా కార్యకర్తలు అభిమానులు నాయకులు మధ్యలో నిర్వహించారు అనంతరం భారీ కేక్ కట్ చేసి అభిమానులకు కార్యకర్తలకు గ్రామస్తులకు పంచిపెట్టారు ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు కార్యకర్తలు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో అతి చిన్న వయసులో శాసనసభ్యురాలుగా గెలుపొంది అసెంబ్లీలో పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తూ పుట్టపర్తిని అన్ని విధాలుగా ముందంజలో నడిపిస్తున్న పుట్టపర్తి శాసన సభ్యురాలు శ్రీమతి పలె సింధూర రెడ్డి జన్మదిన వేడుకలను మనం అందరం జరుపుకోవడం మన అదృష్టమని అలాగే మాజీ మంత్రివర్యులు పుట్టపర్తి నియోజకవర్గం ఇంచార్జ్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మనమందరం రాబోవు రోజుల్లో కలిసిమెలిసి ఒక తాటిపై నడవాలని కేవలం పుట్టపర్తి నియోజకవర్గం అభివృద్ధి చేసే నాయకుడు పల్లె రఘునాథ్ రెడ్డి అని వారి కుటుంబం నుండి వచ్చిన పల్లె సింధూర రెడ్డికి మనమందరం రుణపడి ఉండాలని రాబోవు రోజుల్లో శాసనసభ్యులు పల్లె సింధూర రెడ్డి మనందరికీ మరెన్నో సంక్షేమ పథకాలు సోలార్ మరియు ఇతర కంపెనీలను తెస్తున్నందుకు ప్రతి ఒక్క కుటుంబం పల్లె కుటుంబ సభ్యులకు రుణపడి ఉండాలని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో కన్వీనర్ గోపాల్ రెడ్డి ౌ్రాఖఖీ×ణజ రాష్ట్ర డైరెక్టర్ కాలే నాయక్ మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి మాజీ కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి సీనియర్ నాయకులు రఘువీరారెడ్డి కుమార్ రెడ్డి మాజీ సర్పంచ్ షబ్బీర్ మురళి స్వామి మాజీ సర్పంచ్ కాసుల వెంకటరమణ డీలర్లు గాయత్రి రాజారెడ్డి రమణారెడ్డి ఈశ్వరప్ప బాలకృష్ణ రమణ భాస్కర్ రెడ్డి నంజి రెడ్డి కృష్ణారెడ్డి వెంకట్రెడ్డి రామచంద్ర వడ్డెర్ల సంఘం అధ్యక్షుడు వలిపి కృష్ణప్ప విశ్వనాథ్ రెడ్డి ఫీల్డ్ అసిస్టెంట్ లు రామా0జులు రంగప్ప గిరినాథ్ రెడ్డి మస్తాన్ రామాంజులు డైమండ్ అంజి తదితర పార్టీ కార్యకర్తలు నాయకులు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

# అన్నవరం స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు

**జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లాఆగస్టు 1**



**అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు. వెంట ఏఎంసి చైర్మన్ బ్రహ్మరాజు, సొసైటీ చైర్మన్ పోలిన శ్రీను**

గోపాలపురం నియోజకవర్గ శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు ఆదివారం అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆయన వెంట గోపాలపురం నియోజకవర్గ ఏఎంసి చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, ద్వారకాతిరుమల సొసైటీ చైర్మన్ పోలిన శ్రీను ఉన్నారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వామివారి అనుగ్రహంతో నియోజకవర్గ ప్రజలందరి ఇళ్లలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం నింపాలని మనసారా ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఎమ్మెల్యేకు స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

# ఎంఎస్ఆర్ ఆధ్వర్యంలో జరిగిన వెస్టీజ్ మార్కెటింగ్ కంపెనీ సెమినార్

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, ఆగష్టు 2;**



**కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఎస్ఆర్ సార్**



**కార్యక్రమంలో మాట్లాడుతున్న శివ సార్ (ఆర్మీ సార్).**

ప్రముఖ అంతర్జాతీయ మార్కెటింగ్ దిగ్గజం వెస్టీజ్ కంపెనీ సెమినార్ ఎంఎస్ఆర్ ఆధ్వర్యంలో మాచర్ల పట్టణంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం లోని కళ్యాణ మండపం నందు ఆగష్టు 2 ఆదివారం రోజున జరిగింది. ఈ సెమినార్ లో ముఖ్య అతిథిగా ఎంఎస్ఆర్ సార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ ఆదాయం అందించే కంపెనీ వెస్టీజ్ కంపెనీ అని అన్నారు. ఈ మార్కెటింగ్ రంగంలో ఎలా రాణించాలో తన అనుభవాల ద్వారా చాలా చక్కగా వివరించారు. అలాగే ఈ కంపెనీ లో చేరి ఎలా డెవలప్ అవ్వాలో కూడా తెలియజేశారు. అలాగే శివ సార్(ఆర్మీ సార్) ఆయన తన జీవితంలో జరిగిన అనేక విషయాలను పంచుకున్నారు. తాను మొదట ఆర్మీ లో పని చేశానని, తర్వాత తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి)లో ఉద్యోగం చేశానని ఈ వెస్టీజ్ ఫ్లాట్ ఫాం గురించి తెలుసుకొని ఆయా ఉద్యోగాలకు రాజీనామా చేసి, మనం బ్రతుకుతూ మరో నలుగుర్ని బ్రతికించవచ్చు అని నమ్మి ఈ కంపెనీ లో చేరానని, ప్రస్తుతం నెలకు లక్ష రూపాయలు పైనే వెస్టీజ్ కంపెనీ ద్వారా ఆదాయం పొందుతున్నానని శివ సార్ సెమినార్ కి హాజరైన వారికి తెలిపారు. ఈ సెమినార్ లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మార్కెటింగ్ దిగ్గజాలు మరియు క్రొత్తగా ఈ వెస్టీజ్ మార్కెటింగ్ కంపెనీ లో జాయిన్ అవ్వాలని భావించేవారు పాల్గొన్నారు.

# బళ్లారి రాఘవ సేవలు చిరస్మరణీయం

## జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్

**నెల్లూరు, ఆగస్టు 2: జనసముద్రం జిల్లా ప్రతినిధి**



తెలుగు నాటక, చలన చిత్ర రంగ కళాకారుడు బళ్లారి రాఘవ సేవలు చిరస్మరణీయమని జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్ అన్నారు. ఆయన ఆశయాలు, కళా ప్రస్థానం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ హాలులో ఆదివారం నిర్వహించిన బళ్లారి రాఘవ జయంతి వేడుకల్లో డీఆర్వో విజయ్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొని, ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ, బళ్లారి రాఘవ తెలుగు నాటక రంగానికి విశిష్ట సేవలందించి తనదైన ముద్ర వేశారని కొనియాడారు. కళను సామాజిక చైతన్యానికి వేదికగా మలిచిన మహనీయుడిగా ఆయనను స్మరించుకున్నారు. బళ్లారి రాఘవ ఆదర్శాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెట్నల్ సీఈఓ నాగేశ్వరరావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి అస్గర్ అలీ, సెట్నల్ మేనేజర్ శ్రీనివాసరావు, కలెక్టరేట్ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొని బళ్లారి రాఘవ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

# చిన్న వెంకన్న సేవలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే.

**జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా ఆగస్టు 2 ద్వారకాతిరుమల ప్రతినిధి.**



**ఎమ్మెల్యేకి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న డీఈవో భద్రాజి.**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బోలిశెట్టి శ్రీనివాస్ ఆదివారం ఆలయానికి విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు, పండితులు తూర్పు వైపు గాలిగోపురం వద్ద ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు .స్వామివారి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనాలు, స్వామివారి ప్రసాదాలను ,శేష వస్త్రాన్ని సమర్పించారు. డీఈవో యర్రంశెట్టి భద్రాజి స్వామివారి జ్ఞాపికను అందించారు. వీరితోపాటు ఆలయ అధికారులు, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు,అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి అథ్లెటిక్స్ లో జావెలిన్ త్రో



**జనసముద్రం న్యూస్ రాజన్న సిరిసిల్ల జిల్లా రూరల్ ప్రతినిధి ఆగస్టు 2**

రాజన్న సిరిసిల్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ 2026లో బీజేఆర్ వ్యవసాయ కళాశాల కోనరావుపేట మండల కేంద్రరనీకి చెందిన విద్యార్థి ఇల్లందుల మనోజ్ కుమార్ జావెలిన్ త్రో పోటీలో ప్రథమ స్థానం సాధించి ప్రతిభ చాటారు బి.ఎస్సి (ఆనర్స్) అగ్రికల్చర్ చివరి సంవత్సరం చదువుతున్న మనోజ్ ఈ విజయంతో ఆగస్టు 7న రాజన్న సిరిసిల్ల జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్కు ఎంపికయ్యారు

ఈ సందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ మెరిట్ సర్టిఫికేట్ అందజేసింది బీజేఆర్ వ్యవసాయ కళాశాల యాజమాన్యం అధ్యాపకులు బోధనేతర సిబ్బంది ఇల్లందుల మనోజ్ కుమార్ అభినందిస్తూ రాష్ట్ర స్థాయిలోనూ విజయాన్ని సాధించి కళాశాల జిల్లా విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన చల్మెడ

**జనసముద్రం న్యూస్ రాజన్న సిరిసిల్ల జిల్లా రూరల్ ప్రతినిధి ఆగస్టు 2**



వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామానికి చెందిన విక్కుర్తి సాయిబాబు తండ్రి నారాయణ గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి కేడీసిసి బ్యాంకు డైరెక్టర్ ఏనుగు తిరుపతి రెడ్డి రేగుల రాజేశం సీనియర్ నాయకులు వెంగళ శ్రీకాంత్ గౌడ్ మాజీ కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్ నాయకులు ప్రేమ్ చారి నాయకులు వార్డు నాయకులు సతీష్ రెడ్డిబాలయ్య వెంకటేశం జనార్ధన్ రెడ్డి పరశురాం మ్యాకల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# స్నేహితుల దినోత్సవం సందర్భంగా ప్రొఫెసర్ కాశిమ్ సార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కంద పెద్ద నర్సింహా

**కడ్తాల్ న్యూస్ జనసముద్రం (ఆగష్టు 2)**



స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఎంఆర్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కంద పెద్ద నర్సింహా ప్రొఫెసర్ కాశిమ్ సార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా పరస్పరం ఆప్యాయంగా అభివాదాలు చేసుకుని, స్నేహబంధం, సామాజిక సేవ, ప్రజా సంక్షేమం వంటి అంశాలపై సంక్షిప్తంగా అభిప్రాయాలు పంచుకున్నారు. సమాజంలో స్నేహం, పరస్పర గౌరవం, సహకార భావన మరింత బలపడాలని ఆకాంక్షిస్తూ ఫ్రెండ్‌షిప్ డే శుభాకాంక్షలు తెలిపారు.

# రాంపల్లి చౌరస్తాలో రోడ్డు ప్రమాదం ఒకరి మృతి..

**కీసర మండల్, మేడ్చల్ జిల్లా, జనసముద్రం న్యూస్. ఎస్. బాలకృష్ణ రెడ్డీ :**



రాంపల్లి ఎక్స్ రోడ్ పరిధిలోని మహీంద్ర షోరూమ్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మృతుడు మంద నర్సింహులు, తండ్రి మాధారాములు, వయస్సు సుమారు 35 సంవత్సరాలు, వృత్తి సూపర్వైజర్, నివాసం:ఇందిరమ్మ కాలనీ,చిర్యాల గ్రామం, కీసర మండలం, అను వ్యక్తి రోజు ఉదయం సుమారు 11.00 గంటలకు తన విధులకు హాజరుకావడానికి ఇంటి నుండి తన యొక్క బైక్ టీ ఎస్ 10 ఈ ఎస్ 5739 గల బైక్ పై బండ్లగూడ నుండి రాంపల్లి చౌరస్తా వైపు బయలుదేరాడు. మార్గమధ్యలో రాంపల్లి ఎక్స్ రోడ్ వద్ద గల మహీంద్ర షోరూమ్ సమీపానికి చేరుకోగానే, బండ్లగూడ నుండి నాగారం వైపు వెళ్తున్న ఎ పి 31 టి డి 7668 నంబర్ గల లారీ డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ అకస్మాత్తుగా కుడివైపు మళ్లించి మృతుడి మోటార్‌సైకిల్‌ను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మృతుడు రోడ్డుపై ఉన్న డివైడర్‌పై పడిపోయి తలకు తీవ్ర గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు.

# పెన్షన్ పండుగ ఇంటింటికీ మంత్రి నారాయణ

- రెండేళ్ల నమ్మకం,అభివృద్ధి సంక్షేమాన్ని వివరిస్తూ ముందుకు సాగిన మంత్రి.
- దీనదయాళ్ నగర్ లో రెండు నెలల్లో ఎండ్ టూ ఎండ్ రోడ్లు పూర్తి చేయాలని ఆదేశించిన మంత్రి

**నెల్లూరు, ఆగస్టు 2, జన సముద్రం జిల్లా ప్రతినిధి.**



నెల్లూరు నగరంలోని 4వ డివిజన్ దీనదయాళ్ నగర్‌లో శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ పండుగ వాతావరణంలోలి జరిగింది. రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్ నగదును అందజేశారు. అవ్వాతాతలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి ఆరోగ్య పరిస్థితులు, కుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి వారికి సక్రమంగా అందుతున్నదా అని ఆరా తీశారు.రెండేళ్ల నమ్మకం,అభివృద్ధి సంక్షేమాన్ని వివరిస్తూ ముందుకు సాగారు.దీనదయాళ్ నగర్ లో రెండు నెలల్లో ఎండ్ టూ ఎండ్ రోడ్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అడగకుండానే అన్నీ చేస్తున్న మంత్రికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి స్వయంగా ఇంటి వద్దకు వచ్చి పెన్షన్ అందజేయడం,యోగక్షేమాలు తెలుసుకోవటంతో వృద్ధులు వారి కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఒకే కుటుంబానికి పెన్షన్, 'తల్లికి వందనం', ఉచిత గ్యాస్ సిలిండర్లు, నారాయణ సైకిళ్లు వంటి పథకాల ప్రయోజనాలు అందుతున్నాయని పేర్కొంటూ ప్రపెన్షన్ పండుగ... ఇంటింటికీ మంత్రి నారాయణ రెండేళ్ల నమ్మకం,అభివృద్ధి సంక్షేమాన్ని వివరిస్తూ ముందుకు సాగిన మంత్రి.

దీనదయాళ్ నగర్ లో రెండు నెలల్లో ఎండ్ టూ ఎండ్ రోడ్లు పూర్తి చేయాలని ఆదేశించిన మంత్రి

దిశ, నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు నగరంలోని 4వ డివిజన్ దీనదయాళ్ నగర్‌లో శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ పండుగ వాతావరణంలో జరిగింది. రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్ నగదును అందజేశారు. అవ్వాతాతలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి ఆరోగ్య పరిస్థితులు, కుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి వారికి సక్రమంగా అందుతున్నదా అని ఆరా తీశారు.రెండేళ్ల నమ్మకం,అభివృద్ధి సంక్షేమాన్ని వివరిస్తూ ముందుకు సాగారు.దీనదయాళ్ నగర్ లో రెండు నెలల్లో ఎండ్ టూ ఎండ్ రోడ్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అడగకుండానే అన్నీ చేస్తున్న మంత్రికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి స్వయంగా ఇంటి వద్దకు వచ్చి పెన్షన్ అందజేయడం,యోగక్షేమాలు తెలుసుకోవటంతో వృద్ధులు వారి కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఒకే కుటుంబానికి పెన్షన్, 'తల్లికి వందనం', ఉచిత గ్యాస్ సిలిండర్లు, నారాయణ సైకిళ్లు వంటి పథకాల ప్రయోజనాలు అందుతున్నాయని పేర్కొంటూ ప్రభుత్వానికి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తేదీ అంటే ప్రజలకు గుర్తొచ్చేది ఎన్టీఆర్ భరోసా పెన్షన్లేనని అన్నారు.భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవంలో పాల్గొని పెన్షన్ ల పంపిణీ కోసం నెల్లూరు రావటం జరిగిందన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్‌ను ఒకేసారి రూ.4 వేలకు పెంచి అమలు చేశారని చెప్పారు. గత ప్రభుత్వం వాయిదాల పద్ధతిలో పెన్షన్ పెంచగా, కూటమి ప్రభుత్వం మాట తప్పకుండా ఒకేసారి పెంపు అమలు చేసిందన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు నెలలో 62.07 లక్షల మందికి రూ.2,712.84 కోట్ల పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు పెన్షన్ల కోసం రూ.71,312 కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. రాష్ట్ర జనాభాలో 12.88 శాతం మందికి ఏటా రూ.33 వేల కోట్ల వ్యయంతో పెన్షన్లు అందిస్తున్న ప్రభుత్వం దేశంలో మరెక్కడా లేదని పేర్కొన్నారు. దివ్యాంగులకు రూ.6 వేలు, పూర్తి వికలాంగులకు రూ.15 వేలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.10 వేల పెన్షన్లు అందిస్తున్నామని వివరించారు.నెల్లూరు జిల్లాలో ఈ నెల 2,86,106 మందికి రూ.126.36 కోట్ల పెన్షన్లు మంజూరు కాగా, నగర పాలక సంస్థ పరిధిలో 45,041 మందికి రూ.19.88 కోట్ల పంపిణీ జరుగుతోందన్నారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో 20,305 మందికి రూ.8.91 కోట్ల పెన్షన్లు అందజేస్తుండగా, ఒక్క 4వ డివిజన్‌లోనే 1,228 మందికి రూ.54.19 లక్షల పెన్షన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.గత పాలకులు అన్నా క్యాంటీన్లు,ఏసీ బస్ స్టాప్ లు మూసేశారని,రాష్ట్రాన్ని 10 లక్షలకోట్ల అప్పుల్లో ముంచి వెళ్లారని ఆరోపించారు.సీఎం అపార అనుభవంతో పరిస్థితులు గాడిలో పడుతున్నారు.16 వేల మందికి మెగా డీఎస్సీతో ఉద్యోగాలు ఇచ్చారని,

దానిపైనా అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.త్వరలో జాబ్ క్యాలెండర్ విడుదల చేయబోతున్నామని తెలిపారు.

కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ నందన్, మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నగర టీడీపీ అధ్యక్షుడు మామిడాల మధు, మహిళా నేతలు విజేతా రెడ్డి, పొత్తూరు శైలజ, డివిజన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.భుత్వానికి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తేదీ అంటే ప్రజలకు గుర్తొచ్చేది ఎన్టీఆర్ భరోసా పెన్షన్లేనని అన్నారు.భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవంలో పాల్గొని పెన్షన్ ల పంపిణీ కోసం నెల్లూరు రావటం జరిగిందన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్‌ను ఒకేసారి రూ.4 వేలకు పెంచి అమలు చేశారని చెప్పారు. గత ప్రభుత్వం వాయిదాల పద్ధతిలో పెన్షన్ పెంచగా, కూటమి ప్రభుత్వం మాట తప్పకుండా ఒకేసారి పెంపు అమలు చేసిందన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు నెలలో 62.07 లక్షల మందికి రూ.2,712.84 కోట్ల పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు పెన్షన్ల కోసం రూ.71,312 కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. రాష్ట్ర జనాభాలో 12.88 శాతం మందికి ఏటా రూ.33 వేల కోట్ల వ్యయంతో పెన్షన్లు అందిస్తున్న ప్రభుత్వం దేశంలో మరెక్కడా లేదని పేర్కొన్నారు. దివ్యాంగులకు రూ.6 వేలు, పూర్తి వికలాంగులకు రూ.15 వేలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.10 వేల పెన్షన్లు అందిస్తున్నామని వివరించారు.నెల్లూరు జిల్లాలో ఈ నెల 2,86,106 మందికి రూ.126.36 కోట్ల పెన్షన్లు మంజూరు కాగా, నగర పాలక సంస్థ పరిధిలో 45,041 మందికి రూ.19.88 కోట్ల పంపిణీ జరుగుతోందన్నారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో 20,305 మందికి రూ.8.91 కోట్ల పెన్షన్లు అందజేస్తుండగా, ఒక్క 4వ డివిజన్‌లోనే 1,228 మందికి రూ.54.19 లక్షల పెన్షన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.గత పాలకులు అన్నా క్యాంటీన్లు,ఏసీ బస్ స్టాప్ లు మూసేశారని,రాష్ట్రాన్ని 10 లక్షలకోట్ల అప్పుల్లో ముంచి వెళ్లారని ఆరోపించారు.సీఎం అపార అనుభవంతో పరిస్థితులు గాడిలో పడుతున్నారు.16 వేల మందికి మెగా డీఎస్సీతో ఉద్యోగాలు ఇచ్చారని,దానిపైనా అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.త్వరలో జాబ్ క్యాలెండర్ విడుదల చేయబోతున్నామని తెలిపారు.కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ నందన్, మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నగర టీడీపీ అధ్యక్షుడు మామిడాల మధు, మహిళా నేతలు విజేతా రెడ్డి, పొత్తూరు శైలజ, డివిజన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పింగాళి వెంకయ్య ఆశయాలను చిరస్థాయిగా నిలబెట్టుకుందాం

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎం.ఏ షరీఫ్

**మొగల్తూరు ఆగస్టు 02 జనసముద్రం ప్రతినిధి**





జాతీయ పతాక రూపకర్త మహనీయుడు పింగాళి వెంకయ్య 150వ జయంతిని పురస్కరించుకుని నరసాపురం పట్టణంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో ఘనంగా వెయ్యి అడుగుల జాతీయ జెండాతో "త్రివర్ణ పతాక గౌరవ యాత్ర" నిర్వహించారు. జాతీయ జెండాలను చేతబట్టి దేశభక్తి నినాదాల మధ్య సాగిన ఈ గౌరవ యాత్రకు ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై పింగాళి వెంకయ్యకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం ఈ విధంగా మాట్లాడారు మాట్లాడుతూ, భారతదేశ గౌరవ ప్రతీకగా నిలిచిన త్రివర్ణ పతాకాన్ని ప్రపంచానికి అందించిన మహనీయుడు

సేవలు చిరస్మరణీయమని అన్నారు. దేశభక్తి, జాతీయ సమైక్యత, త్యాగస్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన జాతీయ పతాకం ప్రతి భారతీయుడిలో దేశంపై ప్రేమను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. పింగాళి వెంకయ్య 150వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం ద్వారా నేటి యువతకు ఆయన గొప్పతనాన్ని తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ జాతీయ జెండా గౌరవాన్ని ప్రతి భారతీయుడు కాపాడాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు మాట్లాడుతూ, పింగాళి వెంకయ్య భారత జాతికి అందించిన జాతీయ పతాకం దేశ ఐక్యతకు, స్వాభిమానానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఆయన సేవలను చిరస్థాయిగా నిలబెట్టే ఉద్దేశంతో త్రివర్ణ పతాక గౌరవ యాత్రను నిర్వహించామని తెలిపారు.

అనంతరం నాయకులు, కార్యకర్తలు పింగాళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. దేశభక్తి గీతాలు, జాతీయ నినాదాలతో గౌరవ యాత్ర ఉత్సాహంగా కొనసాగింది.

ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ కొప్పాడి రవీంద్రనాథ్ ఠాగూర్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి అధికారి అనంతరామారావు సొసైటీ బ్యాంకు చైర్మన్ నాగిడి రాంబాబు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు. పొన్నాల నాగబాబు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంగ మురళి నరసాపురం మండల తెలుగు యువత అధ్యక్షులుదొంగ పద్మారావు నరసాపురం నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షులు సమతం వెంకటేశ్వర్లు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ తిరుమని గోవిందరాజు అమరేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ పెంద్ర శ్రీనివాసు జిల్లా బీసీ సెల్ నాయకులు తాడివాడ రమేష్, పట్నాల జగన్ తెలుగుదేశం పార్టీ పట్టణ ఉపాధ్యక్షులు, తోట సత్యానందరావు. శృంగార శ్రీను, ముసుకుడి రవి ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు. జక్కం కాశీ తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఆకన వారి తోటలో డ్రైనేజీ నిర్మించండి మహాప్రభో

- విద్యార్థులు ఆవేదన



**మొగల్తూరు ఆగస్టు 2 జనసముద్రం ప్రతినిధి**

మొగల్తూరు మండలం రామన్నపాలెం గ్రామపంచాయతీ పరిధి ఆకనవారితోట గ్రామంలో వర్షం వస్తే గ్రామస్తులు విద్యార్థులు చాలా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామానికి చెందిన మల్లెపుడి ఏసు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు వివరాలకు వెళ్తే ఆదివారం ఆయన గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంత కాలం నుండి అధిక వర్షాలు కురవడంతో గ్రామంలో డ్రైనేజి రోడ్లు, వ్యవస్థ లేకపోవడంతో ఆ వర్షం నీరు రోడ్డుపై నిలవడంతో గ్రామస్తులు, విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకుంటలేదని దీనిపై అధికారులు స్పందించి గ్రామంలో రోడ్డు డ్రైనేజ్ ను నిర్మించాలని గ్రామస్తులు విద్యార్థులు కోరుతున్నారు.

## రూ.3.86కోట్లతో పెనుబల్లి లో అభివృద్ధి

- బుచ్చి మండలంలో పింఛన్ల పంపిణీ ఇంటింటికి కార్యక్రమంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**నెల్లూరు, ఆగస్టు 2, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**



బుచ్చి రెడ్డిపాలెం మండలం పెనుబల్లి గ్రామంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 3.86కోట్లతో అభివృద్ధి పనులు చేశామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. శనివారం బుచ్చిరెడ్డిపాలెం మండలం పెనుబల్లిలోని సాల్మన్ పురం చెల్లాయి పాలెం గ్రామంలో పింఛన్ల పంపిణీ ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా కూటమి ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లు అందజేసి ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ అందజేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధిపై ఆరా తీసి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి చిన్న సన్నకారు రైతులు సాదా బైనమా భూములు రిజిస్ట్రేషన్ చేసుకోలేక ఇబ్బంది పడుతున్నారని వాటిని కూ టమి న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారి కల నెరవేర్చమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి సంక్షేమం సమ పాలలోచేస్తూఅనేకకార్యక్రమాలుచేపడుతున్నారన్నారు.రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. గ్రామాలలో నాయకులు సమిష్టిగా పనిచేసే కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకుతెలియజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నడివీధి ముత్యాలమ్మ అమ్మవారికి ఆషాడం సారె సమర్పించిన భక్తులు

- కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు పూర్తిస్థాయి ఏర్పాట్లు
- మొగల్తూరులో పండుగ వాతావరణం

**మొగల్తూరు, ఆగస్టు 2 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్**





మొగల్తూరు లో వేంచేసి ఉన్న శ్రీశ్రీశ్రీ నడివీది ముత్యాలమ్మ అమ్మవారికి ఆషాడ మాసం సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో సారె సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో పసుపు, కుంకుమ, చీర, పండ్లు, కొబ్బరికాయలు, పళ్ళు, పలహారాలు, సలవిడి, తీపి పదార్థాలు, పూలతో సారె తీసుకువచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా, ప్రత్యేక పూజలు, హారతులు, అమ్మవారి దర్శనంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యుల ఆరోగ్యం, ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని భక్తులు అమ్మవారిని ప్రార్థించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయగా, కార్యక్రమం ప్రశాంతంగా, భక్తిశ్రద్ధల మధ్య జరిగింది. ఆషాడం సారె సమర్పించడం ద్వారా అమ్మవారి అనుగ్రహం లభిస్తుందని భక్తులు విశ్వసిస్తూ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ దేవరమ్మ తల్లికి ఆషాడం సారె సమర్పించిన భక్తులు

**మొగల్తూరు ఆగస్టు 2 జనసముద్రం ప్రతినిధి**





మొగల్తూరు సత్రవపాలెం గ్రామంలో ఆషాడ మాసం సందర్భంగా సత్రవపాలెంలోని శ్రీ శ్రీ శ్రీ దేవరమ్మ తల్లికి ఆదివారం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆషాడం సారె సమర్పించారు. అమ్మవారికి సంప్రదాయబద్ధంగా చీర, పసుపు, కుంకుమ, పండ్లు, పూలు, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ప్రజా ప్రతినిధులు సైతం ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు ఆషాడం సారే సమర్పించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మంగళహారతులు సమర్పించి కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తుల రాకపోకలతో సత్రవపాలెం గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## వరద పరిస్థితులపై అప్రమత్తమైన తహసీల్దార్ ఈ. నాగార్జున

**మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని హెచ్చరిక జారీ**

**నరసాపురం ఆగస్ట్ 2 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్**





ఎగువ నుంచి వస్తున్న వరద నీరు నరసాపురం వద్ద గోదావరి నీటిమట్టం, ప్రవాహం పెరిగిందని అందువల్ల సఖినేటిపల్లి నరసాపురం రాకపోకలు తాత్కాలికంగా నిలిపియడం జరిగిందని అన్నారు. బారీ వరదలు నేపథ్యంలో నరసాపురం మండలంలోని వరద ముంపు ఉన్న గోదావరి తీర ప్రాంతాలను నరసాపురం తహసీల్దార్ ఈ. నాగార్జున ఆదివారం పరిశీలించారు. అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. ముంపు ముప్పు ఉన్న ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈ సందర్భంగా మత్స్యకారులతో మాట్లాడిన తహసీల్దార్, సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున ఎట్టి పరిస్థితుల్లోనూ వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. వాతావరణ శాఖ సూచనలు, ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ప్రాణ భద్రతే ముఖ్యమని, అధికారులు ఇచ్చే సూచనలను నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు.

అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన సహాయక చర్యలు చేపట్టేందుకు రెవెన్యూ యంత్రాంగం సిద్ధంగా ఉందని తహసీల్దార్ ఈ. నాగార్జున తెలిపారు.

## అరుంధతి కాలనీలో వీధి ఏర్పాటు

**ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్, ఆగస్టు 2:**





ఒంటిమిట్ట మండలం, నరవకాటిపల్లి గ్రామంలోని అరుంధతికాలనీలో ఆదివారం వీధి దీపాలను ఏర్పాటు చేశారు. అరుంధతి కాలనీలో గత 8 నెలలనుండి వీధి దీపాలు లేక చీకటిలో కాలనీ ఉండేది. నరవకాటిపల్లి . స్పెషల్ ఆఫీసర్, సచివాలయం సెక్రటరీ దినేష్ తో చర్చించిన మండల టీడీపీ మైనార్టీ అధ్యక్షులు ఎస్. గఫార్ రహిమాన్, మండల టీడీపీఎస్సీ సెల్ అధ్యక్షులు వి. నరసింహులు 30 వీధి స్థంబాలకు లైట్లు ఏర్పాటు చేయడానికి పనులు ప్రారభిశీచారు.



## నటనకు ఆస్కారం ఉన్న పాత్రలనే ఎంచుకుంటాను: అవికా గోర్

'చిన్నారి పెళ్లికూతురు' సీరియల్‌లో ఆనంది పాత్రతో గుర్తింపు తెచ్చుకున్నారు నటి అవికా గోర్ . ప్రముఖ స్టంట్ రియాలిటీ షో 'ఖత్రోన్ కే ఖిలాడి' ద్వారా ఆమె మళ్లీ బుల్లితెరపై సందడి చేయనున్నారు. ఈ షో 15వ సీజన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు విషయాలు పంచుకున్నారు."ప్రస్తుతం నేను నా ప్రతిభను నిరూపించుకునే అవకాశం ఉన్న పాత్రలనే ఎంచుకుంటున్నాను. ఏదో ఒక పాత్ర అని ఒప్పుకోవట్లేను. 'ఖత్రోన్ కే ఖిలాడి' షో అంత సులభం కాదు. అది శారీరకంగా, మానసికంగా సవాల్‌తో కూడినది. గతంలో ఈ షో 9వ సీజన్‌లో నేను కంటెస్టెంట్‌గా పాల్గొన్నాను. అప్పుడు కొన్ని స్టంట్స్ చేయాలంటే భయమేసింది. వాటితో పోలిస్తే ఈ సారి స్టంట్స్ విషయంలో ఫర్వాలేదు. ప్రస్తుతం కొన్ని ప్రాజెక్టులు చర్చల దశలో ఉన్నాయి. త్వరలో టీవీకి సంబంధించి కూడా ఓ ప్రాజెక్ట్ రాబోతోంది. దానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో ప్రకటిస్తాను. ఓ పంజాబీ మ్యూజిక్ వీడియోలోనూ నటించాను. అది ఆగస్టు 7న విడుదల కానుంది" అని అవికా పేర్కొన్నారు. ఇక, ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టి హోస్ట్ చేస్తున్న 'ఖత్రోన్ కే ఖిలాడీ 15' ప్రస్తుతం జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతోంది.

## చిరంజీవి పుట్టినరోజున డబుల్ ట్రీట్!



కథానాయకుడు చిరంజీవి ప్రస్తుతం బాబీ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. ఈ చిత్ర టైటిల్ టీజర్‌ని చిరు పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 22న విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. అయితే ఇప్పుడదే తేదీకి చిరంజీవి నుంచి మరో కానుక కూడా అందనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన నుంచి రావాల్సిన సినిమా 'విశ్వంభర'. వశిష్ఠ దర్శకత్వం వహించిన ఈ సోషియో ఫాంటసీ యాక్షన్ థ్రిల్లర్ వీఎఫ్ఎక్స్ పనుల వల్ల పలుమార్లు వాయిదా పడిన సంగతి తెలిసిందే. దీన్నిప్పుడు దసరా సందర్భంగా అక్టోబరు 16న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని ఓ కొత్త గ్లింప్స్‌తో చిరు పుట్టినరోజు సందర్భంగా ప్రకటించే అవకాశముందని సమాచారం. ఇప్పటికే ఈ చిత్ర నిర్మాణానంతర పనులు ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ సినిమాకి ఎం.ఎం కీరవాణి సంగీతమందిస్తుండగా.. ఛోటా కే నాయుడు ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించారు.

## .అందుకే ఆ రూల్ బ్రేక్ చేశా: విజయ్ సేతుపతి



కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ సేతుపతి తాజాగా చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. సూపర్ స్టార్ రజనీకాంత్ పై ఆయన చూపించిన అభిమానానికి నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. రజనీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న 'జైలర్ 2' చిత్రంలో ఎందుకు నటించాల్సి వచ్చిందో విజయ్ సేతుపతి తాజాగా వెల్లడించారు. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో 'జైలర్ 2'లో తన అతిథి పాత్ర గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు."నేను ఇతర సినిమాల్లో అతిథి పాత్రలు చేయడం ఎప్పుడో మానేశాను. కేవలం సూపర్ స్టార్ రజనీకాంత్ సార్ కోసమే ఈ రూల్ బ్రేక్ చేశాను. ఆయనతో కలిసి పనిచేయాలనే ఉద్దేశంతోనే 'జైలర్ 2'కి ఓకే చెప్పా. ఒక పోస్టర్‌పై రజనీ సార్‌తో పాటు నా ఫోటో ఉంటే.. సహజంగానే అందరి దృష్టి ఆయనపైనే ఉంటుంది. నన్ను పెద్దగా ఎవరూ గమనించరు. కానీ, ఇతర చిత్రాల్లో అతిథి పాత్రలు చేసినప్పుడు పోస్టర్లపై మనకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంటారు. అది హీరోగా నేను నటిస్తున్న ఇతర సినిమాలపై ప్రభావం చూపుతుంది. అందుకే క్యామియోలు చేయకూడదని గట్టిగా నిర్ణయించుకున్నా.ను" అని ఆయన స్పష్టం చేశారు..గతంలో రజనీ నటించిన 'పేట' చిత్రంలో సేతుపతి ప్రతినాయకుడిగా మెప్పించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆయన కోసం తన సొంత నిబంధనను సైతం పక్కనపెట్టడం చూసి అభిమానులు ఆయనపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా రూ.600 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన బ్లాక్ బస్టర్ హిట్ 'జైలర్'కు సీక్వెల్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అక్టోబర్ 15న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## టైగర్..యాక్షన్ చిత్రం




వైవిధ్యమైన పాత్రలలో తనదైన యాక్షన్ సీక్వెన్స్‌తో ప్రేక్షకుల్ని అలరించారు బాలీవుడ్ కథానాయకుడు టైగర్ ష్రాఫ్. ఆయన ప్రధాన పాత్రలో రెమో డిసౌజా ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ప్రముఖ వ్యాపారవేత్త విక్కీ జైన్ చిత్రనిర్మాతగా తన నిర్మాణ సంస్థ 'వీజే ఫ్రేమ్స్'ను ప్రారంభించినట్లు సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఈ బ్యానర్‌పై మొదటి చిత్రం రెమో దర్శకత్వంలో రూపొందనుంది. ఇందులో టైగర్ ష్రాఫ్, అభిషేక్ బెనర్జీ, ఎల్విష్ యాదవ్ నటిస్తున్నారు. ప్రస్తుతం టైటిల్ ఖరారు చేయని ఈ సినిమా ఉత్కంఠభరితమైన యాక్షన్ ఫ్రాంచైజీలో ఒక భాగం కానున్నట్లు తెలిసింది. ఈ బ్యానర్‌తో కలిసి పనిచేయడం పట్ల దర్శకుడు రెమో మాట్లాడుతూ.."వీజే ఫ్రేమ్స్ నుంచి వస్తున్న మొదటి చిత్రానికి దర్శకత్వం వహించడం, ఆయనతో కలిసి ఈ ప్రయాణంలో భాగం కావడం నాకు చాలా సంతోషంగా ఉంది. విక్కీకి సినిమాల పట్ల ఉన్న నిజమైన అభిరుచితో ఈ ప్రాజెక్టులో చేరారు. టైగర్ ష్రాఫ్, అభిషేక్ బెనర్జీ, ఎల్విష్ యాదవ్ లాంటి అద్భుతమైన నటులు కూడా మా ప్రాజెక్టులో భాగమయ్యారు. త్వరలోనే ప్రేక్షకులకు వినోదం, యాక్షన్, డ్రామా చిత్రాన్ని అందించడానికి ఎదురుచూస్తున్నా" అని అన్నారు.

## స్నేహానికి అల్లు అర్జున్ సరికొత్త నిర్వచనం.. AA23 కోసం వారు కూడా..



నటనతోనే కాదు, స్టైల్‌తోనూ యువతలో క్రేజ్ సొంతం చేసుకున్న అగ్ర కథానాయకుడు నటుడు అల్లు అర్జున్ . 'పుష్ప' సినిమాతో జాతీయ స్థాయిలో స్టార్‌డమ్‌ను, జాతీయ అవార్డును సొంతం చేసుకున్న ఆయన ఇప్పుడు వరుస పాన్ ఇండియా ప్రాజెక్టులతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా సినీ ఇండస్ట్రీలో వ్యక్తుల మధ్య బంధాలకు నిర్వచనం ఇచ్చేది జయాపజయాలు మాత్రమేనని అంటుంటారు. ఇండస్ట్రీ కూడా సక్సెస్ చుట్టూనే తిరుగుతుంది. స్టార్‌డమ్, సక్సెస్, అవార్డులు ఇవన్నీ వస్తుంటాయి పోతుంటాయి. కానీ, ఎప్పటికీ నిలిచేది స్నేహబంధం మాత్రమే. ఈ విషయాన్ని బలంగా నమ్మే వ్యక్తుల్లో అల్లు అర్జున్ ఒకరు. తాను స్టార్‌గా ఉన్నత స్థానాలకు ఎదగడమే కాదు, తనతో కలిసి ప్రయాణం ప్రారంభించిన వారిని, తాను కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలిచిన వారిని తనపాటే తీసుకెళ్లే వ్యక్తే నిజమైన హీరో. అందుకు సరికొత్త నిర్వచనం ఇస్తున్నారు అల్లు అర్జున్.ఆయన కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ‾ూ23గా రానున్న ఈ మూవీపై ఇప్పటికే అందరిలోనూ ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' పూర్తయిన వెంటనే బన్ని ఈ సెట్స్‌లో అడుగు పెడతారు. ఇలాంటి క్రేజీ ప్రాజెక్ట్‌లో తన స్నేహితులను కూడా భాగస్వాములను చేశారు బన్ని. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాకు సహ నిర్మాతలుగా బన్ని వాస్ వ్యవహరిస్తున్నారు. అల్లు అర్జున్ జీవితంలోనూ, కెరీర్‌లోనూ అండగా నిలిచిన వ్యక్తుల్లో బన్ని వాస్ ఒకరు. ఈయనతో పాటు, స్నేహితులు సందీప్ రామినేని, నటరాజ్, స్వాతి కూడా భాగమయ్యారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఈ విషయాన్ని చిత్ర బృందం ప్రకటించింది. తనతో పాటు స్నేహితులు కూడా కెరీర్‌లో ఎదగాలని కోరుకునే బన్ని గతంలోనూ కొందరు స్నేహితులను ప్రోత్సహించారు. ఎస్‌కేయన్, శరత్‌లు ఇప్పటికే సక్సెస్‌ఫుల్ నిర్మాతలుగా రాణిస్తున్నారు. స్నేహం అంటే కేవలం పాత జ్ఞాపకాలను గుర్తుకు చేసుకోవటం మాత్రమే కాదు. అవసరమైన సమయాల్లో ఆదకోవాలనే సందేశాన్ని గుర్తుచేస్తున్నారు.

## ఈ ప్రయాణమంతా నా బిడ్డతోనే.. దీపికా ఆసక్తికర పోస్ట్



బాలీవుడ్ అగ్రకథానాయిక దీపికా పదుకొణె మరోసారి తల్లి కాబోతున్న సంగతి తెలిసిందే. ఆమె తన రెండో సంతానం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా తన ప్రెగ్నెన్సీకి సంబంధించిన ఓ వీడియోను ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ వేదికగా అభిమానులతో పంచుకున్నారు. సాధారణంగా గర్భంతో ఉన్నప్పుడు ఎక్కువ బరువు ఎత్తకూడదని చెబుతుంటారు. కానీ, గర్భవతులుగా ఉన్నప్పటికీ తల్లులు తమ మొదటి బిడ్డను ఎత్తుకుంటూ ఉంటారు. సరిగ్గా ఈ విషయాన్నే చెబుతూ ఉన్న ఓ రీల్‌ను దీపిక పంచుకున్నారు. "నా ప్రెగ్నెన్సీ ప్రయాణం అంతా ఇలాగే సాగుతోంది" అని దానికి క్యాప్షన్ ఇచ్చారు. ఈ వీడియో నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది. తన వ్యక్తిగత విషయాలను దీపిక ఎక్కువగా బయటకు వెల్లడించరు. కానీ, అప్పుడప్పుడూ ఇలాంటి పోస్ట్‌లు చేస్తూ అభిమానులను అలరిస్తుంటారు. ప్రస్తుతం ఆమె తన మొదటి బిడ్డతో సమయం గడుపుతూనే, రెండో బిడ్డకు స్వాగతం పలికేందుకు సిద్ధమవుతున్నారు. పూర్తి సమయాన్ని కుటుంబానికే కేటాయిస్తున్నారు.మరోవైపు వృత్తిపరంగానూ దీపికా వార్తల్లో నిలుస్తున్నారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న 'స్పిరిట్', 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె తప్పుకొన్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రెగ్నెన్సీ కారణంగా తాను రోజుకు కేవలం 8 గంటలు మాత్రమే పనిచేస్తానని షరతు విధించడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. 'కల్కి' తొలి భాగంలో పని చేసినప్పటికీ, ఇప్పుడు కొన్ని కారణాల వల్ల సీక్వెల్‌లో ఆమె నటించడం లేదని నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ కూడా ఇటీవల వెల్లడించింది.